క్లుప్తంగా

పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడిగా నరేందర్‌సింగ్

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్‌లో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం(కరీంనగర్ డెయిరీ) కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఠాకూర్ నరేందర్‌సింగ్, డైరెక్టర్లుగా గూల్ల నాగరాజు, మర్రి ఐలేశ్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో నిర్వహించిన ఎన్నికల్లో రూట్ సూపర్‌వైజర్ సీత రవి పాల్గొని అధ్యక్షుడిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాల సంఘం డైరెక్టర్లు సంధి రాంరెడ్డి, గూల్ల రవి, పాతరవేని రాజయ్య, మంద రవీందర్, కాసాని రాజయ్య, మర్రి బాలయ్య, దండి చంద్రయ్య, పాల సంఘం కార్యదర్శి కుమ్మం శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని వినతి

శంకరపట్నం: రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేసి కొత్తరుణాలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్మరెడ్డి రాజిరెడ్డి కేశవపట్నం కేడీసీసీ బ్యాంక్ మేనేజర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులు, కౌలురైతులకు రైతుభరోసా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో తిరుపతి, శివయ్య, రాములున్నారు.

మహానంది అవార్డు గ్రహీత సమ్మయ్యకు సన్మానం

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని టీడబ్ల్యూజేఎఫ్ కార్యాలయంలో పెన్షనర్స్ అండ్ మ్యారేజ్ బ్యూరో అసిసోయేషన్ బాధ్యులు మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన పోచంపల్లి సమ్మయ్యను శుక్రవారం ఘనంగా సన్మానించారు. సామాజిక సేవలో భాగంగా వధువరూల పరిచయ వేదికను సేవాభావంతో నడుపుతున్నందుకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మహానంది అవార్డుతో ప్రదానం చేశారని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎండీ ఖాజీ హుస్సేన్, జ్యోతిరావు పూలే కమిటీ మాజీ అధ్యక్షుడు సందేల వెంకన్న, పెన్షనర్స్ సంఘం నాయకులు బొంగోని వెంకటయ్య, ఐలి సతీశ్ పోచంపల్లి సమ్మయ్య, పోచంపల్లి శ్రీనివాస్, అనిల్, హరీశ్ తదితరులు ఉన్నారు.

సజ్జద్‌ను సన్మానించిన మైనార్టీ నాయకులు



సజ్జద్‌ను సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

వీణవంక: హుజూరాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎండీ సజ్జద్ ఇటీవల నియామకమయ్యారు. ఈసందర్భంగా మండలంలోని చల్లూరు గ్రామ మైనార్టీ నాయకులు శాలువాతో శుక్రవారం ఘనంగా సన్మా నించారు. కార్యక్రమంలో నాయకులు ఖమ్రొద్దీన్, ఎండీ జాఫర్ సాహబ్, ఇమామ్, ముస్తీ జుబియిర్ అన్సారి, మొహిసిన్‌ఆలం, మునిరుద్దీన్, ముస్తాక్ అహ్మద్, నకియోద్దీన్, జిలానీ, ఫకీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిగా గుర్తింపు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి ధర్మారం గ్రామంలోని సర్వే నంబర్ 368లో 0.33 గుంటలు కుంట శిఖం ప్రభుత్వ భూమిగా గుర్తించి జమ్మికుంట రెవెన్యూ అధికారులు ధృవీకరణ పత్రం అందజేశారని ధర్మారం కౌన్సిలర్ బొంగోని వీరన్న శుక్రవారం తెలిపారు. గతంలో శిఖం భూమి కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నించారని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు విచారణ చేశారని, కుంట శిఖం ప్రభుత్వభూమిగా నమోదైందని ఆర్‌ఐ నదీన్, అధికారులు సమాచార చట్టం హక్కు ద్వారా ధ్రువీకరణ పత్రాన్ని ఇచ్చారని, తప్పుడు పత్రాలను సృష్టించి భూమి కబ్జా చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వీరన్న కోరారు.

నేడు విద్యుత్ సరాఫరా బంద్

మానకొండూర్: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గట్టుదుద్దెనపల్లి, కొండపల్కల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గట్టుదుద్దెనపల్లి, శంషాబాద్, వన్నారం, నిజాయతీగూడెం, కొండపల్కల, కెల్లెడ గ్రామాలకు శనివారం విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నామని చెంజర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ ఎం. రమేశ్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరాఫరా ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తిమ్మాపూర్: మండలంలోని అల్గునూరు ట్రాన్స్ కో పరిధి తిమ్మాపూర్, మహాత్మా నగర్ అల్గునూరు ఎల్ఎండీ కాలనీల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటరమణ తెలిపారు. ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, 33 కేవీ మెయింటినెన్స్‌లో భాగంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ వెంకటరమణ కోరారు

అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- మండల సర్వసభ్య సమావేశంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న మాజీ సర్పంచులు, మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం (ఇన్‌సెట్లో)

రామడుగు: చొప్పదండి నియోజకవర్గంలో ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం హెచ్చరించారు. మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ జవ్వాజీ హరీశ్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చొప్పదండిని విద్య, వైద్యం, వ్యవసాయరంగాల్లో రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా గుర్తింపు తీసుకురావడానికి ప్రత్యేకంగా కృషి చేస్తానని అన్నారు. ఎంపీడీవో కార్యాలయం మరమ్మతుకు రూ.ఐదు లక్షల నిధులు కేటాయించాలని దేశరాజ్‌పల్లి ఎంపీటీసీ వంచ మహేందర్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ప్రతిపాదనలు సిద్ధ చేయాలని ఏఈ సచిన్‌ను ఆదేశించారు. ప్రవేట్ పాఠశాలలకు దీటుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.రెండు వేల కోట్ల నిధులతో ప్రభుత్వ పాఠశాల, కళాశాలను అభివృద్ధి చేస్తున్నారని, ఆగస్టు 15వ తేదీలోపు రూ.రెండు లక్షల రుణమాఫీ జరుగుతుందన్నారు. మండలంలోని గోపాల్‌రావుపేట పంచాయతీ కార్యదర్శిని వెంటనే బదిలీ చేయాలని ఎంపీటీసీ ఎడవెల్లి నరేందర్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎలాంటి అనుమతిలు లేకుండానే పంచాయతీ భవనం ప్రహరీ గోడను కూల్చివేశారని తెలిపారు. గోపాల్‌రావుపేట పంచాయతీ భవనం నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదని దీనిపై తక్షణం చర్యలు చేపట్టాలని ఎంపీటీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రామడుగులో మిషన్ భగీరథ నీరు కలుషితంగా వస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఎంపీటీసీ బొమ్మరవేని తిరుమల ప్రస్తావించారు. దీనిపై తక్షణం చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. గోపాల్‌రావుపేటలో నాణ్యతా లేకుండా సిమెంట్ రోడ్డు నిర్మాణం చేసినప్పటికీ అధికారులు పట్టించుకోని పరిస్థితి ఉందని ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఎంపీపీ జవ్వాజీ హరీశ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో రాజేశ్వరి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు శుక్రుద్దీన్ ఎంపీటీసీలు ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీటీసీలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

చేసిన పనులకు బిల్లులు ఇప్పించాలని వినతి

గ్రామాల్లో చేసిన పలు అభివృద్ధి పనులకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని వెంటనే బిల్లులు వచ్చేలా చూడాలని మండలంలోని తాజా మాజీ సర్పంచ్‌లు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతి పత్రం అందజేశారు. దాదాపు రూ.మూడు కోట్ల పెండింగ్ బిల్లులు రావాల్సి ఉందని వినతిపత్రంలో విన్నవించారు. అప్పులు చేసి పనులు చేశామని, మిత్తి చెల్లించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

‘ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి’



ఏసీపీ శ్రీనివాస్‌జీకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుజూరాబాద్: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అసత్య ప్రచారం చేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జెడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని, సింగరేణి నుంచి ఖమ్మంకు తరలిస్తున్న ఫ్లై యాష్, లారీల ఓవర్ లోడ్‌కు సంబంధించి పొన్నం ప్రభాకర్‌కు సంబంధం ఉందనడం హాస్యాస్పదమన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతిని కోరుకునే నాయకుడని, తెలంగాణ కోసం పోరాడిన గొప్ప నాయకుడని, తప్పుడు ప్రచారం చేస్తే రాబోయే రోజుల్లో గుణపాఠం తప్పదన్నారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్‌చారి, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ఆంజనేయులు, ఉపాధ్యక్షులు దాసరి రామ్మూర్తిగౌడ్, సంఘం నాయకులు గంప వెంకన్న మోత్కూరి శ్రీనివాస్, కొలిపాక వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారంపై ఏసీపీకి ఫిర్యాదు

సోషల్ మీడియాలో మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌పై బీఆర్ఎస్‌నాయకులు అసత్యపు ప్రచారం చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఏసీపీ శ్రీనివాస్‌జీకి కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు కొల్లూరి కిరణ్ కుమార్, సొల్లు బాబు, నేరెళ్ల మహేందర్‌గౌడ్, మేకల తిరుపతి, కొలిపాక శంకర్, సందమల్ల బాబు, మిడిదొడ్డి రాజు, చల్లూరి రాహుల్, మహిళా లీడర్లు లంక దాసరి లావణ్య, యేముల పుష్పలత, ఆలేటి సుశీల తదితరులు ఉన్నారు.

సీపీఐలో చేరిక

హుజూరాబాద్: పట్టణానికి చెందిన స్టూడెంట్ యూనియన్ నాయకుడు లంకదాసరి కల్యాణ్ శుక్రవారం చిగురుమామిడి మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి సమక్షంలో సీపీఐలో చేరాడు. ఈ సందర్భంగా వెంకట్‌రెడర్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు బోయిని అశోక్, బత్తుల బాబు, చాడ శ్రీధర్‌రెడ్డి, కంది రవీందర్ రెడ్డి, వొడ్నాల వెంకటేశ్, శ్రీనివాస్, సమ్మయ్య, రాజేశం, ఒజ్జ కొంరయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వెంకట్‌రెడ్డి

విద్యార్థులకు సన్మానం

గంగాధర: మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల విద్యాలయంలో ఇంటర్ చదివి ఉద్యోగం సాధించిన విద్యార్థులను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ వారుణి, ఉపాధ్యాయులు సన్మానించారు. సింధూజ, శైలజ గతేడాది ఇంటర్ పాస్ కావడంతో పాటు హెచ్‌సీఎల్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలో ఎంపికై ఉద్యోగం సాధించారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అక్షరాభ్యాసం, పుస్తకాలు పంపిణీ



గన్నేరువరం: పుస్తకాలు అందిస్తున్న టీచర్లు



మానకొండూర్: అక్షరాభ్యాసం చేయిస్తున్న టీచర్లు



రామడుగు: పుస్తకాలు అందిస్తున్న టీచర్లు

మానకొండూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు బడిబాటలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు అక్షరాభ్యాసంతోపాటు దుస్తులు, పుస్తకాల పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాల్లోని వసతులు, మధ్యాహ్న భోజనం, ఇతర సౌకర్యాలను ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులకు వివరించారు.

గన్నేరువరం: మండలంలోని పారువెల్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు శుక్రవారం పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. ఎంపీటీసీ స్వప్నచంద్రారెడ్డి, ఏఏపీ చైర్మన్ యాళ్ల తార, కార్యదర్శి చిరంజీవి, ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్, ఉపాధ్యాయులు ప్రభావతి, ఇఫతేఖరలి, చుక్కయ్య, ప్రేమలత పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని రుద్రారం జిల్లా పరిషత్తు పాఠశాల ఉపాధ్యాయులు బడిబాటలో భాగంగా శుక్రవారం ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వపాఠశాలల్లో విద్యాబోధన, వసతులను తెలియజేస్తూ ప్రత్యేకంగా తయారుచేసిన కరపత్రాలను పంపిణీ చేశారు. పది ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారని, పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం సర్కార్ పాఠశాలకు పంపించాలని కోరారు. మండలంలోని గోలిరామయ్యపల్లి, మోతె, గాండ్లపల్లి, రుద్రారం, రంగసాయిపల్లి, దత్తోజీపల్లి గ్రామాలల్లోని కూడళ్ల వద్ద ప్రత్యేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రంగనాథశర్మ, ఉపాధ్యాయులు నాగేందర్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, రమేష్, ఆరిఫ్‌హుస్సేన్, రవీందర్, పద్మజారాణి, కరుణాకర్‌రావు, నల్లగొండయ్య, సరోజ, శంకరయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల విద్య కమిటి చైర్మన్ గుర్రం అనసూయ పలువురు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ ప్రారంభం

చొప్పదండి: పట్టణంలోని నవదోయ విద్యాలయం సమీపంలో చొప్పదండి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాణిజ్య పెట్రోల్‌బంక్‌ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శుక్రవారం ప్రారంభించారు. సొసైటీ ద్వారా గతంలో ఉన్న కన్స్యూమర్ పంపును, రిటైల్ అవుట్‌లెట్‌గా మార్చారు. ఇఫ్‌కో ద్వారా మంజూరైన రూ.15 లక్షల విలువైన డ్రోన్ పిచికారీ యంత్రాన్ని ప్రారంభించారు. అనంతరం మండలంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ, ఎంపీపీ రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, క్రిబ్‌కో స్టేట్ మేనేజర్ రామకృష్ణయ్య, ఇఫ్‌కో జిల్లా మేనేజర్ బాలాజీ, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణ రావు, మాజీ చైర్మన్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ ముద్దం మహేశ్ గౌడ్, సీఈవో క్లెం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిని కలిసిన నాయకులు



చిగురుమిమాడి: సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

చిగురుమామిడి: కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బీజేపీ చిగురుమామిడి మండల అధ్యక్షుడు పైడిపెల్లి శ్రీనివాస్ ఢిల్లీలో బండి సంజయ్‌ని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. స్వీట్లు పంపిణీ చేసి అభినందనలు తెలిపారు. తనతో పాటు పది మండలాలకు చెందిన బీజేపీ అధ్యక్షులు కేంద్ర మంత్రిని కలిసినట్లు శ్రీనివాస్ తెలిపారు.

జమ్మికుంట: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఢిల్లీలోని ఆయన నివాసంలో జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్, బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు ఉన్నారు.

సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేయాలి

చొప్పదండి: పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణంలోని బీజేపీ నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నాగరాజుకు వినతిపత్రం అందించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు అట్టహాసంగా ప్రారంభించిన పనులు నిలిచిపోయాయని, అసంపూర్తి రోడ్డుతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పట్టణశాఖ అధ్యక్షుడు ప్రశాంత్, శ్రావణ్, అనుమాండ్ల రాజశేఖర్, వడ్లూరి సుధాకర్, తాడూరి శివక్రిష్ణ, జిట్ట కుమార్, గుండేటి శివ, కళ్యాణ్, అఖిల్, అజయ్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

పిల్లల సంఖ్య పెంచాలి

చొప్పదండి: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల నమోదు సంఖ్య పెంచాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి కోరారు. పట్టణంలోని ఐకేపీ సమావేశ మందిరంలో శుక్రవారం వెలుగు మండల సమాఖ్య సభ్యులకు అంగన్‌వాడీల్లో పిల్లల చేరికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరేళ్లపైవారిని ప్రభుత్వ పాఠశాలల్లో, రెండున్నరేళ్ల నుంచి ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. సమావేశంలో రేణుక, ఏపీఎం నర్మద, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రమాదేవి

ఆర్టీఏ అధికారుల తనిఖీ

తిమ్మాపూర్: పాఠశాలల పునఃప్రారంభం కావడంతో ఫిట్‌నెస్ లేకుండా రోడ్లపైకి వస్తున్న స్కూల్ బస్సులను జిల్లా రవాణా అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఫిట్‌నెస్ లేకుండా పిల్లలను తరలిస్తున్న, ట్యాక్స్ చెల్లించని, ఇతర వాహనాలను పట్టుకున్నారు. వాహనాలను ఆర్టీవో ఆఫీస్‌కు తరలించారు. తనిఖీల్లో ఏఎంవీఐలు ప్రమీల, స్రవంతి పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న రవాణా అధికారులు

లాసెట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంక్

మానకొండూర్: ఇటీవల వెలువడిన లాసెట్ ఫలితాల్లో మండలంలోని ఊటూరు గ్రామానికి చెందిన దాసరి కల్యాణి రాష్ట్రస్థాయిలో 1060 ర్యాంకు సాధించింది. పోచంపల్లి మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ చదవి న్యాయశాస్త్రంపై మక్కువతో లాసెట్ పరీక్షకు హాజరైంది. తండ్రి అంజయ్య, అన్న ప్రశాంత్ ప్రోత్సాహంతోనే ఈ ర్యాంక్ సాధ్యమైందని కల్యాణి సంతోషం వ్యక్తం చేసింది. ఈసందర్భంగా గ్రామస్తులు కళాశాల యజమాన్యం, తోటి విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

మద్యం పట్టివేత



మానకొండూర్: మండల కేంద్రంలోని రెండు దాబాలపై టాస్క్‌ఫోర్స్, మానకొండూర్ పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు చేసి అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు సీఐ మాదాసు రాజ్‌కుమార్ తెలిపారు. మద్యం విక్రయిస్తున్న వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థిని ఎంపిక



ప్రియదర్శినిని సన్మానిస్తున్న హెచ్ఎం లచ్చయ్య, ఉపాధ్యాయులు, తదితరులు

చొప్పదండి: మండలంలోని రాగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని దీకొండ ప్రియదర్శిని ఎన్ఎంఎంఎస్(నేషన్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు ఎంపికైంది. ఈసందర్భంగా పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు మొగిలి లచ్చయ్య, ఉపాధ్యాయులు కర్ర వెంకట్‌రాంరెడ్డి, తదితరులు విద్యార్థినిని అభినందించారు.

గోదాం నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ వెంకటేశ్వర్‌రావు

రామడుగు: రామడుగు సహకార సంఘం ఆధ్వర్యంలో వెదిరలో రూ.50 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న గోదాం, వ్యాపార సముదాయ పనులను శుక్రవారం సంఘం చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు త్వరగా పూర్తి చేస్తే రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచే అవకాశం ఉంటుందన్నారు. త్వరలో ప్రారంభోత్సవం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎల్లా జగన్ రెడ్డి, పుర్మాణి శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో మల్లేశం పలువురు పాల్గొన్నారు.

ఏఐఎస్‌బీ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

హుజూరాబాద్: పట్టణంలో ఏఐఎస్‌బీ(ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్) 74వ వార్షికోత్సవాల పోస్టర్‌ను ఉమ్మడి జిల్లా కన్వీనర్ కొలుగూరి సూర్యకిరణ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతూ, ప్రభుత్వ విద్యాసంస్థలు, యూనివర్సిటీల పరిరక్షణకు పోరాడుతున్నామని తెలిపారు. విద్య కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటాలు చేస్తుందని, రాబోయే రోజుల్లో సైతం విద్యారంగా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ నాయకులు కుక్కముడి రాజేష్,కొండ్ర నగేష్, వినయ్, సాగర్, రాము, నవీన్, రాకేష్, అజయ్, అంజి, జయరాం తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐఎస్‌బీ నాయకులు

వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట

సైదాపూర్: మండలంలోని గర్రెపల్లిలో వర్షాలు కురవాలని చిన్నారులు శుక్రవారం కప్పతల్లి ఆట ఆడారు. తడి గుడ్డలో కప్పను కట్టిన రోకలిని ఇద్దరు చిన్నారులు మోస్తూ గ్రామంలో ఇంటింటికీ తిరిగారు. గ్రా మస్తులు కప్ప, పిల్లల మీద నీళ్లపోసి వరుణదేవుడు కరుణించాలని వేడుకున్నారు.



రక్తదానం

శంకరపట్నం: ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా మండలంలోని కేశవపట్నం, తాడికల్ గ్రామాలకు చెందిన యువకులు శుక్రవారం రక్తదానం చేశారు. శ్రావణ్, మణిదీప్, శ్రీకాంత్ తదితరులు హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానం చేశారని వైద్యసిబ్బంది పేర్కొన్నారు.